క్లుప్తంగా

108 వ్యవస్థను ప్రభుత్వమే నిర్వహించాలి



అనపర్తి ఎంపీడీఓ రామకృష్ణారెడ్డికి సమ్మె నోటీసు అందజేస్తున్న 108 ఉద్యోగులు

పెదపూడి: 108 వ్యవస్థను ప్రభుత్వమే నిర్వహించి ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని అనపర్తి 108 ఉద్యోగులు ఆనందరావు, మురళీకృష్ణ, ఆదినారాయణ ప్రభుత్వాన్ని కోరారు. వారు శుక్రవారం అనపర్తి ఎంపీడీఓ రామకృష్ణారెడ్డికి సమ్మె నోటీసు అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ..తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈనెల 25 నుంచి నిరవధిక సమ్మె చేపట్టనున్నట్లు ప్రకటించారు. పెండింగ్ బిల్లులు, వేతనాలు, ఆర్జిత సెలవులకు సంబంధించిన సొమ్మును అరబిందో సంస్థ నుంచి ఉద్యోగులకు చెల్లించే ఏర్పాటు చేయాలన్నారు. ఎనిమిది గంటల పని విధానాన్ని 108 వ్యవస్థలో అమలు చేయాలన్నారు. ప్రతి నెల 5వ తేదీలోపు వేతనాలు చెల్లించాలన్నారు.

తులసిమాతకు పంచామృతాభిషేకాలు



తులసిమాతకు పూజలు చేస్తున్న అర్చకుడు హనుమంతాచార్యులు

పెదపూడి: సంపర కోదండ రామాలయంలో కార్తిక పౌర్ణమి సందర్భంగా తులసిమాతకు విశేష పూజలు చేశారు. తులసిమాతకు పంచామృతాభిషేకం, కుంకుమ, పసుపు పుష్పాలతో పూజించారు. ముత్తయిదువులకు కుంకుమ, పూలు పంపిణీ చేశారు. అధిక సంఖ్యలో భక్తులు వచ్చి తులసిమాతను దర్శించుకుని పూజల్లో పాల్గొన్నారు. పెదపూడి మండలంలో రామేశ్వరం, జి.మామిడాడ, పెదపూడి, కరకుదురు, కాండ్రేగులు, శహపురం, పెద్దాడ తదితర గ్రామాల్లో కార్తిక పౌర్ణమి సందర్భంగా భక్తులు తెల్లవారు జామునుంచి శివాలయాలకు వెళ్లి స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.

ఇక ఇళ్ల వద్దకే వైద్యసేవలు



పీహెచ్‌సీ వద్ద కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న వైద్య సిబ్బంది

రంగంపేట: మండల కేంద్రమైన రంగంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం ఎన్‌సీడీసీడీ సేవలు ప్రారంభించినట్టు పీహెచ్‌సీ వైద్యాధికారిణి బి.వేణుశ్రీలక్ష్మి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిన నేషనల్ కమ్యూనికబుల్ డిసీజ్ (ఎన్‌సీడీసీడీ 3.0) మరియు రాష్ట్రీయ బాల ఆరోగ్య (ఆర్‌బిఎస్‌కె) కార్యక్రమాలు ప్రారంభించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమాల్లో భాగంగా మండలంలోని 19 సచివాలయాల్లో ఏఎన్‌ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశాలు ప్రజల వద్దకే ఇంటింటికీ వెళ్లి వ్యాధుల నియంత్రణపై అవగాహన కలిగించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో డాక్టర్ కె.చిన్నారావు, సింగంపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారిణి కె.సంకీర్తన, సీహెచ్‌ఓ కె.జయమణి, ఎంపీహెచ్‌ఈఓ పి.ప్రసాద్, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

నేరాల నియంత్రణకు కృషి



కోరుకొండ సీఐ కార్యాలయాన్ని పరిశీలిస్తున్న ఐజీ అశోక్ కుమార్

మధురపూడి: నేరాలను పూర్తిస్థాయిలో నియంత్రించేందుకు కృషి చేయాలని ఏలూరు రేంజ్ ఐజీ జీవీజీ అశోక్ కుమార్ అన్నారు. కోరుకొండ సర్కిల్ కార్యాలయాన్ని శుక్రవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. అక్కడి రికార్డులను పరిశీలించి, సంతృప్తి వ్యక్తం చేశారు. సీఐ సత్య కిషోర్, సిబ్బందికి రివార్డు రాశారు. ఆయన మాట్లాడుతూ మహిళలపై దాడులు, అత్యాచారాలను అరకట్టేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. గంజాయి, మత్తు పదార్థాల రవాణా, వినియోగాన్ని అరికట్టాలన్నారు. గంజాయి వల్ల కలిగే అనర్థాలపై విద్యాసంస్థల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఆయన వెంట ఎస్పీ నరసింహ కిషోర్, అడిషనల్ ఎస్పీ, సుబ్బరాజు, నార్త్ జోన్ డివిజన్‌కు ఇన్‌చార్జి, కొవ్వూరి డీఎస్పీ దేవ కుమార్ ఉన్నారు. కార్యక్రమంలో కోరుకొండ సీఐ సత్యకిషోర్, ఎస్సై, ఏఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

శివలింగ మహాయజ్ఞం

- బంక మట్టితో కోటి శివలింగాల తయారీ
- చురుగ్గా కార్యక్రమం



రాజానగరంలో బంక మట్టితో శివలింగాలను తయారు చేస్తున్న మహిళలు

రాజానగరం: పవిత్ర కార్తిక మాసం సందర్భంగా ఎక్కడ చూసినా ఆధ్యాత్మిక శోభ కనిపిస్తోంది. ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అయ్యప్ప మాలధారుల సందడితో కళకళలాడుతోంది. అలాగే ప్రజలలో ఆధ్యాత్మిక భావాలను వ్యాపింప చేయాలనే ప్రధాన సంకల్పంతో చేపట్టిన కోటి పార్థివ శివలింగాల తయారీ యజ్ఞం రాష్ట్రంలో చురుగ్గా జరుగుతోంది. రాజమహేంద్రవరంలోని భోగలింగేశ్వర ధార్మిక సేవాసమితి ఆధ్వర్యంలో ఆయా ప్రాంతాల్లోని భక్తుల సహకారంతో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. కార్తిక మాసం చివరకు దీన్ని పూర్తి చేసి, దేశంలోని 12 పుణ్య నదులలో ఆ శివలింగాలను నిమజ్జనం చేయాలనే ఆలోచనతో ట్రస్టు ప్రతినిధులు వెంట్రాప్రగడ ఆదినారాయణమూర్తి, ముసునూరి అయ్యప్ప, ఇతర సభ్యులు ముందుకు సాగుతున్నారు.

మార్చిలో ప్రారంభం

శివలింగ మహాయజ్ఞానికి సంబంధించిన వివరాలను భోగలింగేశ్వర ధార్మిక సేవాసమితి ప్రతినిధి ఆదినారాయణమూర్తి 'సాక్షి'కి వివరించారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. ఆధ్యాత్మిక భావాలను అందరితో పంచుకోవడంతో పాటు వివిధ ప్రాంతాలకు కూడా విస్తరించే విధంగా చేపట్టిన కోటి శివలింగాల తయారీని మార్చిలో ప్రారంభించారు. వీటి తయారీకి అవసరమైన బంక మట్టి, ఆయిల్, ఫ్రేమ్ తదితర మెటీరియల్‌ను వివిధ ప్రాంతాలకు పంపించారు. అక్కడి పెద్దలు, భక్త కమిటీలు, భక్తుల సహకారంతో తయారు చేయిస్తున్నారు.

25 కేంద్రాలు

రాజమహేంద్రవరం, కాకినాడ, అమలాపురం, ద్రాక్షారామ, వాడపల్లి, రావులపాలెం, విశాఖపట్నం, చీపురుపల్లి, కోరుకొండ, రాజానగరం తదితర 18 కేంద్రాలలో మొదట్లో ఈ కార్యక్రమం ప్రారంభమైంది. ఇప్పుడు 25 కేంద్రాలకు విస్తరించింది. అక్కడ తయారైన శివ లింగాలను పెట్టెలలో ప్యాక్ చేసి మోరంపూడి, దొమ్మేరులోని గోడౌన్లలో భద్రపరుస్తున్నారు. కోటి లింగాలు తయారు చేసిన తర్వాత వాటిని దేశంలోని 12 పుణ్య నదులలో కలపడమే ఈ కార్యక్రమ ప్రధాన లక్ష్యం. కార్తిక మాసం ఆఖరులోగా వీటిని పూర్తి చేయాలనే సంకల్పంతో చర్యలు చేపట్టారు.



తయారు చేసిన శివలింగాలు

ఫిబ్రవరిలో అతిరుద్ర యాగం

భోగలింగేశ్వర ధార్మిక సేవాసమితి ఆధ్వర్యంలో పలుచోట్ల యాగాలు, యజ్ఞాలు నిర్వహిస్తున్నారు. దానిలో భాగంగా 2025 ఫిబ్రవరి 13 నుంచి 24 వరకు రాజ శ్యామల సహిత పంచాయతన పూర్వక అతిరుద్ర యాగం చేయడానికి సంకల్పించారు. రాజమహేంద్రవరంలోని త్యాగరాజ కల్యాణ మండపంలో 150 మంది వేద పండితుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరపనున్నారు. ఈ సందర్భంగా ప్రవచనాలు, భరత నాట్యం పోటీలు, సంగీత విభావరి, భక్తి పాటల పోటీలను 12 రోజుల పాటు నిర్వహించనున్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

రాజానగరం: స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో సాక్షి పత్రిక ముద్రణా కార్యాలయం వైపు ఉన్న 11 కేవీ ఇండస్ట్రియల్ ఫీడర్‌పై వార్షిక మరమ్మతుల నేపథ్యంలో శనివారం ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సరఫరా ఉండదు. అలాగే జాతీయ రహదారిపై ఉన్న మరో 11 కేవీ ఇండస్ట్రియల్ ఫీడర్ పనుల నేపథ్యంలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సరఫరా నిలిపివేస్తారు. ఈ కారణంగా పల్లకడియం, రామస్వామిపేట, సాక్షి కార్యాలయాలకు ఆ సమయంలో విద్యుత్ అంతరాయం కలుగుతుంది. ఈ విషయాన్ని ఏపీఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ దాట్ల శ్రీధర్ వర్మ తెలిపారు.

పరిశుభ్రతతో ఆరోగ్యం

సీతానగరం: పరిశుభ్రతతో ఆరోగ్యంగా ఉండవచ్చని ఎంపీహెచ్‌ఈవో వైఎస్ రాయుడు అన్నారు. వెదుళ్లపల్లిలో శుక్రవారం ఫ్రైడే – డ్రైడే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో పర్యటించి నీటి నిల్వలను తొలగించారు. నీటి కుండీలు, పూల కుండీలు, కొబ్బరి డొక్కలు, ఎయిర్ కూలర్లలో నీరు నిల్వ ఉంచకూడదని ప్రజలకు అవగాహన కల్పించారు.

దాడి చేశారంటూ ఫిర్యాదు

సీతానగరం: ఇంటికి మెట్ల నిర్మించుకుంటుండగా జరిగిన ఘర్షణపై పోలీసులు కేసు నమోదు చేశారు. ముగ్గళ్లకు చెందిన చిక్కిరెడ్డి వరలక్ష్మి తన ఇంటి ముందు మెట్లు నిర్మించుకుంటుండగా అదే ప్రాంతంలోని వాకపల్లి రామారావు, గంగమణి అభ్యంతరం తెలిపారు. ఈ విషయంలో వారి మధ్య గొడవ జరిగింది. ఈ నేపథ్యంలో తనపై దాడి చేశారని వరలక్ష్మి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్సై రామ్ కుమార్ కేసు నమోదు చేశారు.

అన్న సమారాధన

మధురపూడి: కోరుకొండ మండలం గాడాలలోని రాజరాజేశ్వరి అమ్మవారి ఆలయం వద్ద శుక్రవారం అన్న సమారాధన నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు పడాల పండు, కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి అనేక మంది భక్తులు తరలి వచ్చి అన్న ప్రసాదం స్వీకరించారు. ఉదయం అమ్మవారికి అభిషేకాలు, కుంకుమ పూజలు చేశారు.

గౌరీశంకర ఆలయంలో ఏకాహం



పందలపాకలో భజన చేస్తున్న భజన బృందం సభ్యులు

బిక్కవోలు: మండలంలోని పందలపాక గ్రామంలోని శ్రీ గౌరీశంకర ఆలయం వద్ద ఏకాహం నిర్వహించారు. శుక్రవారం కార్తిక పౌర్ణమి పురస్కరించుకుని ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఉదయం నుంచి శ్రీ గౌరి శంకర బాల భక్త భజన మండలి ఆధ్వర్యంలో భజనలు చేశారు. చుట్టు పక్కల గ్రామాల భజన మండలి సభ్యులు పాల్గొని భజనలు చేశారు. సోమవారం ఉదయం వరకు ఏకాహం నిర్వహించడం జరుగుతుందని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.



అనపర్తిలో గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా పుస్తక ప్రదర్శన

అక్షర జ్ఞానంతో భవితకు బాట

రంగంపేట: అక్షర జ్ఞానంతో విద్యార్థుల భవితకు బంగారు బాటలు వేసుకోవాలని మండల విద్యాశాఖాధికారి కె. శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం స్థానిక శాఖా గ్రంథాలయంలో లైబ్రేరియన్ ఎస్. రామకోటేశ్వరరావు ఆధ్వర్యంలో 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా రెండోరోజు చిత్ర లేఖనం పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ శ్రీనివాసరావు గ్రంథాలయ పితామహుడు అయ్యంకి వెంకటరమణయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఎంఈఓ–2 పి.మధుసూదనరావు మాట్లాడుతూ పుస్తక పఠనంతో విషయ పరిజ్ఞానం పెంపొందించుకోవచ్చన్నారు. ఇరిగేషన్ శాఖ విశ్రాంత ఉద్యోగి ప్రసాదరావు మాట్లాడారు. చిత్ర లేఖనం పోటీలకు వివిధ పాఠశాలల నుంచి 120 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

అక్షరమే ఆయుధం

బిక్కవోలు: అక్షరాన్ని ఆయుధంగా మలుచుకొని విద్యార్థులు జీవితంతో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని గ్రంథాలయశాఖ అధికారి ఎస్ బాల అన్నారు. శుక్రవారం 57వ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా రెండోరోజు పుస్తక ప్రదర్శను నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థికి పుస్తకం మంచి స్నేహితుడని నిత్యం పుస్తక పఠనాన్ని అలవర్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.

జీవితాన్ని తీర్చిదిద్దేది మంచి పుస్తకమే

పెదపూడి: జీవితాన్ని తీర్చిదిద్దడానికి పుస్తకం దోహద పడుతుందని అనపర్తి ద్వారంపూడి బుల్లమ్మాయి జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు వై.బీ.ఎస్.ఆచార్యులు అన్నారు. అనపర్తిలో 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా పుస్తక ప్రదర్శనను శుక్రవారం నిర్వహించారు.



చిత్రలేఖనం పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

పుస్తకం సమాజ మార్పులో ముఖ్యపాత్ర పోషిస్తోందన్నారు. అనంతరం విద్యార్థులు పుస్తక ప్రదర్శన తిలకించారు. గ్రంథాలయ అధికారి జి.అభిలాష్ పాల్గొన్నారు. పెదపూడి మార్కెట్ సెంటర్లో గల గ్రంథాలయంలో గ్రంథాలయ అధికారి హర్షవర్ధన్ ఆధ్వర్యంలో పుస్తక ప్రదర్శన నిర్వహించారు.

మాదక ద్రవ్యాలతో అనేక అనర్థాలు

సీతానగరం: జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా సీతానగరం గ్రంథాలయంలో రెండోరోజు శుక్రవారం పుస్తక ప్రదర్శన, మాదక ద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. లైబ్రేరియన్ అరుణ్ కుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సీనియర్ పాఠకుడు ఎం.శివకుమార్, ఉపాధ్యాయుడు జి.అశోక్ కుమార్ పాల్గొన్నారు.

రాజానగరం: స్థానిక గ్రంథాలయంలో శుక్రవారం నిర్వహించిన పుస్తక ప్రదర్శనను ఆదిత్య యూనివర్సిటీ గ్రంథాలయాధికారి సోమరాజు ప్రారంభించారు. గ్రంథాలయంలో ఉన్న పుస్తకాలను అవకాశం ఉన్న మేరకు పఠనం చేస్తూ విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో ఎస్‌బీఐ వ్యవసాయ విభాగం అధికారి సతీష్, లైబ్రేరియన్ టి. సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.



రాజానగరంలో పుస్తక ప్రదర్శన

ఘనంగా కార్తిక పౌర్ణమి పూజలు



పందలపాకలో జ్వాలా తోరణం వెలిగిస్తున్న దృశ్యం



రాజానగరంలో శివాలయంలో జ్వాలా తోరణోత్సవం



బిక్కవోలులో ప్రత్యేక అలంకరణలో గోలింగేశ్వరస్వామి



ధరణకోట శివాలయం వద్ద దీపోత్సవం

బిక్కవోలు: కార్తిక పౌర్ణమి సందర్భంగా మండలంలోని పలు ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. శుక్రవారం వేకువ జామునే కాలువ స్నానాలు ఆచరించిన మహిళలు కాలువ గట్టున కార్తిక దీపాలను వెలిగించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో దీపాలు వెలిగించి స్వామివారిని దర్శించుకున్నారు. మహిళలు ఉదయం నుంచి ఉపవాసం ఉండి స్వామివారిని దర్శంచుకుని ఆరుబయట పూజలు చేశారు. పున్నమి చంద్రుడిని అద్దంలో చూసి అనంతరం ప్రసాదం స్వీకరించారు. ఆలయాల్లో రుద్రాభిషేకాలు చేశారు. బిక్కవోలు, పందలపాక, ఊలపల్లి, కొంకుదురు గ్రామాల్లో కార్తిక పూజలు నిర్వహించారు.

వైభవంగా జ్వాలాతోరణం

బిక్కవోలు: మండలంలోని పందలపాక గ్రామంలోని స్థానిక సుబ్రహ్మణ్యస్వామి ఆలయం వద్ద కార్తిక పౌర్ణమిని పురస్కరించుకుని శుక్రవారం జ్వాలాతోరణం కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. అర్చకులు కొమాళ్లపల్లి మల్లేశ్వరశర్మ ఆధ్వర్యంలో ముందుగా స్వామివారిని గ్రామంలో ఊరేగించారు. సాయంత్రం జ్వాలా తోరణాన్ని వెలిగించారు. జ్వాలాతోరణం నుంచి గడ్డిని సేకరించారు. ఈ గడ్డి కాలిన బూడిదను పొలాల్లో జల్లుకుంటే పంటలు బాగా పండుతాయనేది భక్తుల విశ్వాసం. దీంతో భారీగా రైతులు వచ్చి గడ్డిని సేకరించడానికి ఎగబడ్డారు. భక్తులు విశేషంగా పాల్గొన్నారు.

రాజానగరం మండలంలో..

రాజానగరం: కార్తిక పౌర్ణమిని పురస్కరించుకుని నియోజకవర్గంలోని శివాలయాలు శుక్రవారం భక్తులతో కిటకిటలాడాయి. రాజానగరంలోని పురాతన ప్రసిద్ధి చెందిన రాజలింగేశ్వరస్వామి, రాజగోపాల స్వామి, రాజరాజేశ్వరి ఆలయాలకు భక్తులు పోటెత్తారు. దీపారాధనలతో ఆలయం ప్రాంగణం కొత్త శోభను సంతరించుకుంది. సంధ్యా సమయం దాటిన తరువాత ఆలయం వద్ద నిర్వహించిన జ్వాలా తోరణోత్సవంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. శివ పార్వతులు కొలువు తీరిన పల్లకీతో ముందుతున్న జ్వాలా తోరణం కింద నుంచి 'హరహర మహదేవ శంభోశంకర' అంటూ మూడు పర్యాయాలు ప్రదక్షిణలు చేశారు. అగ్నికి ఆహుతైన తోరణాలను దక్కించుకునేందుకు భక్తులు పోటీపడ్డారు. వాటితో పాడి పంటలు వృద్ధి చెందుతాయని విశ్వాసం. అనంతరం గ్రామంలో పల్లకీ ఉత్సవం నిర్వహించారు.



అనపర్తిలో అఖండ దీపారాధనలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి



అనపర్తి రామలింగేశ్వరస్వామి ఆలయం వద్ద జ్వాలాతోరణం నిర్వహిస్తున్న భక్తులు

ఉపవాస దీక్షతో..

కార్తిక పౌర్ణమిని మహిళలు భక్తి శ్రద్ధలతో జరుపుకొన్నారు. ఉదయం నుంచి ఉపవాస దీక్షలో ఉన్న మహిళలు సాయంత్రం ఆయా గ్రామాల్లో ఉన్న శివాలయాలకు వెళ్లి దీపారాధనలు చేసి, శివపార్వతులను దర్శించుకున్నారు. అనంతరం స్వగృహాలకు చేరుకుని తులసికోట వద్ద దీపారాధనలు చేశారు. అద్దంలో చంద్ర దర్శనం చేసుకుని హారతులు పట్టారు. చలిమిడిని ప్రసాదంగా తీసుకుని ఉపవాస దీక్షను విరమించారు. అలాగే పలువురు కుంటుబ సభ్యులతో కలిసి పౌర్ణమి నోములు నోచుకున్నారు.

దీపారాధనలు

రాజానగరం: మండలంలోని సంపత్ నగరం శివాలయం ఆవరణ శుక్రవారం సాయంత్రం దీపాలతో కళకళలాడింది. కార్తిక పౌర్ణమిని పురస్కరించుకుని ఆలయ అర్చకులతో పాటు పలువురు మహిళలు స్వస్తిక్, ఓంకారం, లింగాకారం, శంఖుచక్రాలు, గోవింద నామాలు ఆకృతులలో దీపాలు వెలిగించారు. దీతో ఆలయ ప్రాంగణం కార్తిక శోభను సంతరించుకుంది.

సామూహిక కుంకుమార్చన

రాజానగరం: కార్తిక పౌర్ణమి సందర్భంగా పాత తుంగపాడులోని కనకదుర్గమ్మ ఆలయం వద్ద శుక్రవారం సామూహిక కుంకుమార్చనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పెద్దసంఖ్యలో మహిళలు పాల్గొన్నారు. ఉదయం నుంచి ఉపావాస దీక్షలో ఉన్న వీరంతా సాయంత్రం దీపారాధనలు చేసిన తరువాత చంద్ర దర్శనం చేసుకుని ఉపవాస దీక్షను విరమించారు.

మధురపూడి: కోరుకొండ మండలం కాపవరంలో రాజరాజేశ్వరి అమ్మవారు, విఘ్నేశ్వరస్వామివార్లకు శుక్రవారం పౌర్ణమి సందర్భంగా పంచామృతాలు, పండ్లరసాలతో అభిషేకాలు నిర్వహించారు. ఆలయ ధర్మకర్త నీరుకొండ బాబ్జీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో..

పెదపూడి: భక్తులు కార్తిక పౌర్ణమి వేడుకలను భక్తి శ్రద్ధలతో నిర్వహించి పరమశివుని అనుగ్రహం పొందాలని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి అభిలషించారు. అనపర్తిలో విశ్వబ్రాహ్మణ సంక్షేమ సేవా సంఘం వారిచే పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయం వద్ద నిర్వహించిన కార్తిక పౌర్ణమి పూజలకు మాజీ ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి హాజరై స్వామి వారిని దర్శించుకున్నారు. అఖండ దీపారాధన పూజల్లో పాల్గొన్నారు. అర్చకుడు, విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు పొన్నాడ రాజు పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు, భక్తులు చింతాడ, వీరభద్రాచార్యులు, తాళబత్తుల వీరబ్రహ్మానందం, మేడ తాతాచార్యులు, ఎంపీటీసీ సభ్యుడు భీమేష్, వైఎస్సార్‌సీపీ నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అనపర్తి మండలంలోని గ్రామాల్లో కార్తిక పౌర్ణమి సందర్భంగా శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. భక్తులు తెల్లవారు జాము నుంచి ఆలయానికి చేరుకుని ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. అనపర్తిలో ఉమాలింగేశ్వరస్వామి ఆలయం వద్ద స్వామివారికి పల్లకీసేవ అనంతరం జ్వాలాతోరణ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ధరణకోట శివాలయంలో నిర్వహించిన దీపోత్సవం భక్తులను అలరించింది. అయ్యప్పస్వామి ఆలయంలో అన్నదాన కమిటీ చైర్మన్ పడాల సత్తిరెడ్డి గురుస్వామి ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు.



రాజానగరం శివాలయ ప్రాంగణంలో దీపాలు వెలిగిస్తున్న భక్తులు



పాత తుంగపాడులో మహిళల సామూహిక కుంకుమార్చన



సంపత్ నగరంలో శంఖుచక్రాలు, గోవింద నామాల ఆకారంలో వెలిగించిన దీపాలు